

పైనాపిల్ ధర పతనం

గత వారం వారపు సంతలో ఒక్కోటి రూ.30కి విక్రయం

- ఈ వారం రూ.6 పలికిన ధర
- గిరిజన రైతులు డీలా

మాడుగుల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పైనాపిల్ ధర పతనం కావడంతో గిరిజన రైతులు డీలా పడ్డారు. గత సోమవారం వారపు సంతలో పైనాపిల్ ఒక్కోటి రూ.30కి విక్రయించారు. ఈ సోమవారం ఒక్కోటి రూ.6కి విక్రయించాల్సి రావడంతో ఆవేదన చెందారు.

పాడేరు ఏజెన్సీ గిరిజన ప్రాంతాలు దేవాపురం, సలుగు, కందులపాలెం, ఈదులపాలెం, వంట్లమామిడి, కక్కి నుంచి గిరిజన రైతులు ఇక్కడ జరిగిన వారపు సంతలో విక్రయించేందుకు పండించిన పైనాపిల్, పనస పండ్లను సోమవారం తీసుకువచ్చారు. వర్షాల కారణంగా ఆదివారం సాయంత్రమే ఇక్కడికి చేరుకున్నారు. సోమవారం వారపు సంతకు వ్యాపారులు ఎక్కువ మంది రాలేదు. పైనాపిల్‌ను కొనుగోలు చేసేవారు లేక తొలుత ఒక్కోటి రూ.14కు విక్రయించగా, గంట తరువాత ఒక్కసారిగా రూ.8 నుంచి రూ.6లకు ధర పడిపోయింది. వర్షం కారణంగా పండ్లను తిరిగి తీసుకు వెళ్లలేక ఆ ధరకే రైతులు విక్రయించాల్సి వచ్చింది. అలాగే గత వారం పనస పండు పెద్దది రూ.60కి విక్రయించగా, ఈ వారం రూ.10 నుంచి రూ.20 మధ్య ధర పలకడంతో గత్యంతరం లేక విక్రయించారు. ఒక్కసారిగా ధరలు తగ్గిపోవడంతో ఆటో ఖర్చులకు కూడా రాలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.



సోమవారం వారపుసంతలో విక్రయించేందుకు గిరిజన ప్రాంతాల నుంచి రైతులు తెచ్చిన పైనాపిల్

వరాహావతారంలో జగన్నాథుడు

స్థానిక శ్రీకేశవ స్వామి ఆలయంలో జగన్నాథుని దశ రూప మహోత్సవాల్లో భాగంగా సోమవారం జగన్నాథస్వామి వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కూర్మావతారంలో ఉన్న జగన్నాథుడిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

- చోడవరం/ఆంధ్రజ్యోతి



వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి

బదిలీల్లో సచివాలయ సిబ్బంది పైరవీలు

- ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో అధికారులపై ఒత్తిడి
- రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లకు అవకాశం ఇవ్వడంతో నచ్చిన చోటకు..

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

బదిలీల్లో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది పైరవీలు చేస్తున్నారని విమర్శలు న్నాయి. తమకు కావలసిన చోట పోస్టింగ్ కోసం ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది.

గత మూడు రోజులుగా విశాఖపట్నంలో జరగుతున్న బదిలీల కౌన్సెలింగ్‌లో ఇప్పటికే రెవెన్యూ, వ్యవసాయ, పశుసంవర్ధక, ఇంజనీరింగ్ శాఖల్లోని పలువురు ఉద్యోగులు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం ఇవ్వడంతో తమకు కావాల్సిన చోట పోస్టింగులు వేయించుకోగలిగారు. మరికొందరు ఐదేళ్ల సర్వీసు పూర్తి పూర్తికాకపోయినా కావాల్సిన చోట పోస్టింగ్ కోసం రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకొని, ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసు లేఖలతో బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఆయా శాఖల వారీగా ఉమ్మడి విశాఖపట్నం వేదికగా జరుగుతోంది. జనాభా ప్రాతిపదికన సచివాలయాలను ఎ, బి, సి గ్రేడులుగా విభజించారు. బదిలీల కోసం జూన్ 22 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్

... మిగతా 8వ పేజీలో



విశాఖలో బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన సచివాలయ సిబ్బంది

అక్కడ నర్సులే వైద్యులు

- మునిసిపాలిటీలోని సోమలింగపాలెం, పెదపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని దుస్థితి
- ఎనిమిది నెలలుగా వైద్యులు లేకపోవడంతో ఇదే పరిస్థితి
- మొక్కుబడిగా ఇన్‌చార్జి వైద్యులను నియమించినా సేవలందించని వైనం
- పేద రోగులకు అందని వైద్యం
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖాధికారులు

ఎలమంచిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని 1వ వార్డు సోమలింగపాలెం, 20 వ వార్డు పెదపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు లేకపోవడంతో నర్సులే రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. సుమారు ఎనిమిది నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఆయా ఆరోగ్య కేంద్రాలకు ఇన్‌చార్జి వైద్యులను నియమించినా వారు సక్రమంగా రావడం లేదని రోగులు చెబుతున్నారు. ఆయా ఆస్పత్రుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక వైద్యుడు, ఆరుగురు సిబ్బంది చొప్పున విధులు నిర్వహించాలి. పెదపల్లి ఆరోగ్య కేంద్రానికి పెదపల్లి, గొల్లలపాలెం, కొక్కిరాపల్లి, మంత్రిపాలెం, చిన గొల్లలపాలెం ప్రాంతాలకు చెందిన రోగులు వస్తుంటారు. అలాగే సోమలింగపాలెం ఆరోగ్య కేంద్రానికి నారాయణపురం, కొత్తూరు, జంపపాలెం నుంచి రోగులు వస్తుంటారు. ఈ రెండు ఆస్పత్రుల వైద్యులు బదిలీపై వెళ్లిపోవడంతో అనకాపల్లికి చెందిన ఇద్దరు వైద్యులను ఇన్‌చార్జులుగా నియమించారు. అయితే వాళ్లు కేవలం సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించడానికి, సమావేశాలకు మాత్రమే ఇక్కడికి వస్తారని తెలిసింది. దీంతో ఈ రెండు ఆస్పత్రుల పరిధిలోని పేద రోగులు వైద్య సేవలు పొందలేకపోతున్నారు. సాధారణ జ్వరం, జలుబు, దగ్గుకు నర్సులే మందులు ఇచ్చి పంపుతున్నారు. ఈ ఆస్పత్రుల్లో వైద్యులు లేకపోవడం వల్ల ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని, స్థోమత లేకపోతే నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నామని పేద రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ఆస్పత్రులకు పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని వారు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న పెదపల్లి ఆస్పత్రి



వైద్యుల కోసం సోమలింగపాలెం ఆస్పత్రిలో ఎదురు చూస్తున్న రోగులు

హాస్టల్ నిర్వహణపై ఆగ్రహం

'పేట'లో బీసీ బాలికల కాలేజి హాస్టల్‌ను తనిఖీ చేసిన హోం మంత్రి అనిత

- మెనూ అమలు చేయకపోవడం, వార్డెన్ లేకపోవడంపై సీరియస్
- విద్యార్థినుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న వైనం
- విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారికి ఆదేశం

పాయకరావుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహంలో మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంపై హోం మంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి స్థానిక బీసీ బాలికల కాలేజి హాస్టల్‌ను ఆమె తనిఖీ చేశారు. వసతి గృహంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడం, అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం, మెనూ సక్రమంగా అమలుచేయకపోవడంపై సీరియస్ అయ్యారు.

వసతి గృహంలో సౌకర్యాలను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి మెనూను పరిశీలించారు. వంట మనిషి మెనూ అమలు చేయకపోవడంతో పాటు సన్న బియ్యం వాడకపోవడంపై

... మిగతా 8వ పేజీలో



మెనూ అమలుచేయకపోవడంపై వంట మనిషిని నిలదీస్తున్న హోం మంత్రి



ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

గంజాయి కేసులో ముద్దాయికి 14 ఏళ్ల జైలు

- రూ.1.4 లక్షల జరిమానా

విశాఖ లీగల్/ఎలమంచిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వ్యాన్ డ్రైవర్‌కు 14 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1.4 లక్షల జరిమానా విధిస్తూ ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ఎన్‌వీ ప్రసాద్ అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెద్దఉప్పలం గ్రామంలో నివాసం ఉంటున్న నల్ల తేజోమూర్తి (45) వ్యాన్ డ్రైవర్. 2019 ఫిబ్రవరి 3న ఎలమంచిలి పోలీసులు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో తేజోమూర్తికి చెందిన వ్యాన్‌లో 200 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. తేజోమూర్తిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎలమంచిలి సీఐ జి.నారాయణరావు కేసు నమోదు చేసి, విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం ముద్దాయి తేజోమూర్తిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

బాలికల బడికి సొంత గూడు ఎన్నడో?

ఆరేళ్లుగా అద్దె భవనంలోనే జ్యోతిబాపూలే బాలికల హైస్కూల్

- గత వైసీపీ ప్రభుత్వంలో జన్నవరంలో స్థలం కేటాయింపు
- నిధులు విడుదల చేయకపోవడంతో జరగని నిర్మాణాలు
- పాఠశాల సమస్యపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం
- చోడవరంలో భవన నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయం
- హైకోర్టును ఆశ్రయించిన జన్నవరం గ్రామస్థులు
- వివాదం పరిష్కారమైతే తప్పా కొలిక్కిరాని వైనం



చోడవరంలో అద్దె భవనంలో కొనసాగుతున్న జ్యోతిబాపూలే బాలికల గురుకులం

చోడవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల ఉన్నత పాఠశాల ఆరేళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ పాఠశా లకు స్థలం కేటాయించిన గత వైసీపీ ప్రభుత్వం నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థినులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అరకొర వసతులతో అసౌక ర్యాల నడుమ విద్యార్థినులు చదువు కొనసాగిస్తున్నారు. దీనికి తోడు ఈ పాఠశాల భవనాలను జన్నవరంలోనే నిర్మిం చాలని ఆ గ్రామస్థులు కోర్టును ఆశ్రయించడంతో సమస్య జఠిలమైంది. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలను 2019 సెప్టెంబరులో స్థానిక కో- ఆపరేటివ్ కాలనీలో ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో దీనిని ఏర్పాటు చేసి ఏడాదిలోపే సొంత భవనాలు సమకూరుస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. అయితే అప్పటి నుంచి మూడు అంతస్థుల అద్దె భవనంలో ఈ పాఠశాల కొనసాగుతోంది. ఒక అంతస్థులో వంట గది, భోజనాల నిర్వహణ కొనసాగుతుండగా, రెండు, మూడు ఫ్లోర్లలో విద్యార్థినుల తరగతి గదులు, డార్మెటరీ ఉన్నాయి. సరైన వసతి లేకపోవడంతో 240 మంది విద్యార్థినులు అసౌకర్యాల నడుమ సర్దుకుపోతున్నారు.

నిధులు విడుదలకాక ఇక్కట్లు

జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులానికి మండలంలోని జన్నవరం పంచాయతీ పరిధిలో 10 ఎకరాల స్థలాన్ని గతంలో అధికారులు ఎంపిక చేశారు. ఈ స్థలాన్ని బీసీ గురుకులం సొసైటీ పేరిట బదలాయించడంలో తీవ్రమైన జాప్యం కారణంగా 2022లో అధికారులు ఈ స్థలాన్ని బీసీ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. తరువాత ఈ స్థలంలో భవనాల నిర్మాణానికి రూ.35 కోట్లు

... మిగతా 8వ పేజీలో

పెద్దాస్పత్రికి సుస్తీ

కేజీహెచ్‌లో ఆరు నెలలుగా నిలిచిపోయిన గుండె శస్త్రచికిత్సలు

- కీలకమైన పరికరాలు పనిచేయకపోవడమే కారణం
- రోగుల అవస్థలు...
- కొత్తవి కొనుగోలుకు సుమారు రూ.2.5 కోట్లు అవసరం
- అద్దె ప్రాతిపదికన తెచ్చిన పరికరం కూడా మొరాయింపు
- మల్లగుల్లాలు పడుతున్న ఆస్పత్రి అధికారులు
- ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రిగా పేరుగాంచిన కేజీహెచ్‌లో గడిచిన కొద్దిరోజులుగా గుండె శస్త్రచికిత్సలు జరగడం లేదు. ఆపరేషన్లు నిర్వహించేందుకు అవసరమైన కీలకమైన పరికరాలు పనిచేయకపోవడంతో సమస్య ఉత్పన్నమైనట్టు అధికారులు చెబుతున్నారు.



కేజీహెచ్ కార్డియాలజీ విభాగం

కేజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగానికి ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో రోగులు వస్తుంటారు. అయితే, గడిచిన కొద్ది నెలలుగా ఇక్కడ ఓపెన్ హార్ట్ సర్జరీలు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ శస్త్రచికిత్సలు నిర్వహించాలంటే కొన్ని రకాల పరికరాలు అవసరముంటుంది. ఇందులో అత్యంత కీలకమైనది హార్ట్ లంగ్ మెషీన్. గుండెకు సరఫరా అయ్యే రక్తాన్ని డైవర్ట్ చేసి వైద్యులు శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసేందుకు ఈ పరికరం ఉప యోగపడుతుంది. ఈ పరికరం కేజీహెచ్‌లో మూలకు చేరింది. ఒక సంస్థ నుంచి ఈ పరికరాన్ని అద్దె ప్రాతి పదికన తెచ్చి కొద్దికాలం శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అయితే, కొన్నాళ్లుగా అది కూడా మొరాయించడంతో శస్త్ర చికిత్సలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే, గుండె శస్త్ర చికిత్స సమయంలో టెంపరేచర్‌ను నిర్వహించడం అన్నది

... మిగతా 8వ పేజీలో



పనిచేయని కీలక పరికరాలు

విద్యార్థి దశ అత్యంత కీలకం : సీఐ

అచ్యుతాపురం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ అత్యంత కీలకమని అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ అన్నారు. మండలంలోని యర్రవరం డీ పాల్ స్కూల్‌లో సోమవారం నాయకత్వ లక్షణాలపై ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే పోటీ ప్రపంచంలో ఎలా ఉండాలో నేర్పించడం ద్వారా మంచి నాయకత్వ లక్షణాలను కలిగి ఉంటారని తెలిపారు. పోటీ పరీక్షలలో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ మెర్లిన్, వైస్ ప్రిన్సిపాల్ లిబిన్, థామస్, సుజి తదితరులు పాల్గొన్నారు.











'పేట' అభివృద్ధికి అన్ని పార్టీలు సహకరించాలి

▸ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

పాయకరావుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధికి అన్ని పార్టీలు సహకరించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కోరారు. సోమవారం పట్టణంలోని పంచాయతీరాజ్‌శాఖ అతిథి గృహంలో జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులు, కూటమి నాయకులతో సమావేశమైన ఆమె పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధికి రానున్న నాలుగేళ్లలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై ప్రణాళికలు సిద్ధం చేయడంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తోందన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పథకం అమలు, ఇప్పటికే రెండు గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి త్వరలో ఇవ్వనున్నామన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం తొలి అడుగు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గం అభివృద్ధికి రానున్న నాలుగేళ్లలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని, సుమారు రూ.11 వేల కోట్లతో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు, రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్‌ప్లాంట్, టాయ్ పరిశ్రమ రానుందన్నారు. వీటి వలన 60 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. నియోజకవర్గంలో టెంపుల్ టూరిజం, తీరప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి శచీదేవితోపాటు అని ప్రభుత్వ శాఖల అధికారులు, నాలుగు మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం మంత్రి వి.అనిత

అజెండాలోని అంశాలను చర్చించకుండానే మమ అనిపించేశారు..

▸ పారిశుధ్య చర్యలు మెరుగుపడాలి: చైర్‌పర్సన్

▸ సమస్యల పరిష్కారంలో జాప్యంపై కౌన్సిలర్ల ధ్వజం

ఎలమంచిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అజెండాలో పొందుపరిచిన 22 అంశాలపై చర్చ జరగకుండానే మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మమ అనిపించేశారు. సోమవారం చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభంలో చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ ప్రజారోగ్యానికి హాని జరుగుతుందనే నిపుణుల సలహాలతో పట్టణంలోని ఏడు ఆకుల చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో పారిశుధ్యం ఆశించిన స్థాయిలో ఉండడం లేదని, ఇంకా మెరుగుపడాలన్నారు. అనంతరం వైస్‌చైర్మన్ ఆర్రెపు గుప్తా, కౌన్సిలర్లు సంతోష్, మరిడేశ్వరావు పలు సమస్యలపై ధ్వజమెత్తారు. విద్యుత్ సమస్యను ఎన్నిమార్లు కౌన్సిల్ ముందుంచినా పరిష్కరించడం లేదని, పట్టణంలో కొన్ని వీధి లైట్ల నిర్వహణ తీరు బాగాలేదని గుప్తా తెలిపారు. కొత్తపాలెం వార్డులో నిబంధనలు పాటించకుండా భవన నిర్మాణం జరుగుతున్నా పట్టించుకోలేదని కౌన్సిలర్ సంతోష్ అధికారులను నిలదీశారు. మునిసిపాలిటీలో విలీనమైన కొక్కిరాపల్లి వార్డును గ్రామ పంచాయతీగా మార్పు చేయాలని కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ కోరారు. వార్డులో కనీస అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీగా మార్పు చేస్తే ప్రజలకు ఉపాధి పనులు ఉంటాయన్నారు. తమ వార్డును పంచాయతీగా మార్పు చేసేందుకు అవసరమైతే తాను నిరాహారదీక్ష చేపతానని హెచ్చరించారు. అనంతరం బదిలీపై వచ్చిన ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఇంటి పన్నులు వసూళ్ల గురించి రెవెన్యూ అధికారి కౌన్సిల్ ముందుంచారు. ఈ సందర్భంగా దేశ రక్షణలో సేవలందిస్తున్న వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మునిసిపల్ అధికారులు, వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

'సమాజానికి దిక్సూచి గురువే'


ఆంగ్ల ఉపాధ్యాయుడు చౌదరిని సత్కరిస్తున్న దృశ్యం

నక్కపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, సామాజిక సేవకులుగా విద్యార్థులను తయారు చేస్తూ, తద్వారా సమాజానికి ఉపాధ్యాయులు దిక్సూచిలా పనిచేస్తున్నారని పీఆర్‌టీయూ జిలా అధ్యక్షుడు డీ గోపీనాథ్ అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడు కేవీబీఆర్ చౌదరి సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎంలు శాస్త్రి, జగన్మోహన్, టీవీ రమణ, శివాజీ, ఎస్‌వీఎస్ ఆచార్యులు, పద్మావతి, లక్ష్మీనారాయణ, సుందరరావు, ఝాన్సీ రాణి, డీవీఎస్ రావు, చోడిశెట్టి సత్యనారాయణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.







'2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలి'


ఆందోళన చేస్తున్న రోడ్డు విస్తరణ నిర్వాసితులు

అచ్యుతాపురం రూరల్, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వాసితులు చేసిన ఆందోళనలో ఆయన మాట్లా డారు. ఇళ్లు, దుకాణాలు, భూములకు ఒకేసారి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం టీడీఆర్ బాండ్లు ప్రతిపాదన విరమించుకోవాలని, నష్టపరిహారాన్ని నగదు రూపంలో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాసిత నాయకులు రొంగలి రాము, కర్రి అప్పారావు, కె.రామ సదాశివరావు, ఎస్.కన్నమనాయుడు, బుద్ధ రంగారావు, ఎస్.బ్రహ్మాజీ, శరగడం జగ్గారావు, ఆడారి శివ, రామకృష్ణ, శివ, పిల్లి గురునాధరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించడం లేదు

▸ మండల సమావేశంలో ఉపాధి పథకం ఏపీవోపై చౌడువాడ సర్పంచ్ ఆరోపణ


మాట్లాడుతున్న చౌడువాడ సర్పంచ్ గోపాలకృష్ణ

కోటవురట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ ఏపీవో నాగరాజు సహకరించడం లేదని చౌడువాడ సర్పంచ్ గోపాలకృష్ణ ఆరోపించారు. సోమవారం ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో చెరువ గట్లపై 600 కొబ్బరి మొక్కలు నాటించాలనన్నారు. ఈ మొక్కల వద్ద గొప్పు తవ్వేందుకు పది మంది ఉపాధి కూలీలు ఇవ్వాలని కోరగా తిరస్కరించారన్నారు. గ్రామాభివృద్ధి కోసం కూలీలను పంపించమని అడిగితే పట్టించుకోలేదని మండిపడ్డారు. కొండ మీద ఎందుకు పనికి రాని పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. అనంతరం మండల వ్యవసాయాధికారిణి సరోజిని మట్లాడుతూ ఖరీఫ్‌కు వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం పదవీవిరమణ చేస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథంను మాజీఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, ఎంపీపీ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ సీతబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, జానకి శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, అధికారులు ఘనంగా సన్మానించారు.

ప్రజల్లోకి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు : అమర్‌నాథ్


సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్

అచ్యుతాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అచ్యుతాపురంలో ఒక ప్రైవేటు కళ్యాణ మండపంలో జరిగిన రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారని విమర్శించారు. వైసీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో కరణం ధర్మశ్రీ, శోభా హైమావతి, కన్నబాబు రాజు, బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు.

జడ్‌పీటీసీ సభ్యురాలిని పరామర్శించిన వైసీపీ నేతలు


ఉమాదేవిని పరామర్శించిన వైసీపీ నేతలు

కోటవురట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జడ్‌పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి మామ అచంటి అప్పారావు ఈనెల 22వ తేదీన మృతి చెందడంతో ఆమెను సోమవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ నేత చిక్కాల రామారావు పరామర్శించారు. కైలాసపట్నంలో అప్పారావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సిద్దాబత్తుల నాగేశ్వరరావు, సత్తిబాబు, పైల నానిబాబు, శెట్టి రమణ, తుమ్మలపల్లి ఆంజనేయులు, మీడియా సెల్ కన్వీనర్ చామంతులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు అనుమతి తగదు

▸ వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్

మునగపాక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పగటిపూట తిరిగి భారీ వాహనాలకు అనుమతి ఇవ్వడం ప్రమాదాలకు స్వాగతం పలకడమే అవుతుందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అఖిలపక్షంగా, పార్టీపరంగాను పలు మార్లు నిరసనలు, ఆందోళనలు చేశామన్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు పగటిపూట భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా నిబంధనలు విధించారన్నారు. దీనిపై మరో మారు డీఎస్పీని కలుస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచులు దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగఅప్పలనాయుడు, నరాలశెట్టి సూర్యనారాయణ, ఆడారి కాశిబాబు, కాండ్రేగుల జగన్, రాజు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఎస్.రాయవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని టీడీపీ నాయకుడు గుర్రం రామకృష్ణ అన్నారు. సోమవారం తిమ్మాపురంలో యోగా గురువు దవరసింగి రాంబాబు సమక్షంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పప్పల శివ, కోరా జగదీష్, బదిరెడ్డి లోవరాజు, వంగలపూడి బుజ్జి, సమ్మంగి శ్రీను పాల్గొన్నారు.

'పేట' పోలీస్ స్టేషన్‌కు అత్యాధునిక బైక్


కొత్త బైక్‌ని ప్రారంభిస్తున్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు

పాయకరావుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్, తదితర విధులు నిర్వర్తించేందుకు ప్రభుత్వం స్థానిక పోలీస్ స్టేషన్‌కు అత్యాధునిక ఎక్విప్‌మెంట్ బైక్‌ని అందజేసింది. సోమవారం పాయకరావుపేటలో నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఈ బైక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌడ్ సైరన్, మైక్, ఫ్లాష్‌లైట్, ఫస్ట్ ఎయిడ్ కిట్ తదితర ఎక్విప్‌మెంట్స్ ఉన్న ఈ వాహనం పట్టణంలో ట్రాఫిక్ క్లియరెన్స్, స్కూల్స్ వద్ద, రాత్రిపూట గస్తీకి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ జి.అప్పన్న, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కారిడార్ నిర్వాసితుల ప్యాకేజీ పెంచాలని ఆందోళన


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ ప్రతినిధులు

నక్కపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం అందజేసే ప్యాకేజీని రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, రైతు సంఘ నాయకులు తళ్లా భార్గవ్, సూరకాసుల గోవింద్, తదితరుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అక్కడి నుంచి హోం మంత్రి అనిత నివాసం వద్దకు వెళ్లేందుకు సిద్ధమవ్వగా పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే సీఐ కుమారస్వామి, నర్సీపట్నం ఆర్డీవో రమణ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నిర్వాసిత రైతులతో మాట్లాడారు. అనంతరం నిర్వాసిత రైతులు ప్యాకేజీని రూ. 25 లక్షలకు పెంచాలంటూ ఆర్డీవో రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని తాను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో చెప్పారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ

పాయకరావుపేట రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందించే వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్ అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో సోమవారం రైతులకు వరి విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సకాలంలో సబ్సిడీపై వరి విత్తనాలను సరఫరా చేస్తుందన్నారు. ఏవో పి. ఆదినారాయణ మాట్లాడుతూ రైతులు విత్తన శుద్ధి చేసిన విత్తనాలను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథ్, మందపాటి శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్ సన్యాసమ్మ, ఏఈఓ నాగమణి, వీహెచ్‌ఏ వీరబాబు, ఏపీఎంపీ బుజ్జమ్మ, రైతులు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాశీ విశ్వనాథ్


సంఘం ఉపాధ్యక్షుడు బొంది కాశీ విశ్వనాథ్‌ను సత్కరించిన దృశ్యం

పాయకరావుపేట రూరల్, జూన్30 (ఆంధ్రజ్యోతి): ఏపీ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండలానికి చెందిన టీడీపీ నాయకుడు బొంది కాశీ విశ్వనాథ్ నియమితులయ్యారు. అనకాపల్లిలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు నడికుదుటి అర్జునరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు బొంది కాశీవిశ్వనాథ్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ మత్స్యకారుల సంఘం అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మునగపాక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):మండలంలో తోటాడ పంచాయతీ శివారు గవర్ల అనకాపల్లి గ్రామంలో కమ్యూనిటీ భవనం పునఃనిర్మాణానికి సోమవారం సర్పంచ్ దొడ్డి మంగవేణి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ నుంచి రూ. పది లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, పొలమరశెట్టి మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, గ్రామ పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మౌనికను అభినందించిన టీడీపీ శ్రేణులు


5వ ర్యాంకు సాధించిన మౌనికను సత్కరించిన టీడీపీ శ్రేణులు

మునగపాక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ పోస్టు గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2025లో ప్రతిభ చాటిన పెంటకోట సాయిమౌనికను తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందించారు. జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో మౌనిక రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించింది. మునగపాక గ్రామానికి చెందిన మౌనిక ఇంటికి సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, తెలుగుయువత మండల అధ్యక్షుడు సంతోష్ వెళ్లి ఆమెను శాలువతో సత్కరించారు.

9వ తేదీన దేశవ్యాప్త సమ్మె

రాంబిల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): లేబరు కోడ్లకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఇక్కడ సమ్మెకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, ముఠా, ఆటో కార్మికులు పాల్గొన్నారు.


అనకాపల్లిలో నరసింహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

నరసింహావతారంలో జగన్నాథుడు

అనకాపల్లి టౌన్/కశింకోట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథ రథోత్సవంలో భాగంగా అనకాపల్లి గూడ్స్ షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న మందిరం, కశింకోట వేణుగోపాల ఆలయంలో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి వారు సోమవారం నరసింహావతారంలో దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున అర్చకులు విశేష అలంకరణలు, పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనకాపల్లిలోని ఆలయ మండపంలో వాసుదేవ అన్నమయ్య సంకీర్తనా సంస్థానమ్, నీలాతి గణపతి ఆధ్వర్యంలో సంకీర్తనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చైర్మన్ దాడి బుజ్జి, ఈవో మురళీ, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బతికున్న వ్యక్తి మరణించినట్టుగా రికార్డుల్లో నమోదు!

▸▸ రికార్డులు సరిచేయాలని బాధితుడు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు


కలెక్టరేట్‌లో అర్జీ సమర్పించిన ఏసు

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి బతికి ఉండగానే మరణించినట్టు సచివాలయ సిబ్బంది మూడేళ్ల క్రితం రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో సదరు వ్యక్తి తాను బతికి ఉన్నట్టు తిరిగి రికార్డుల్లో సరిచేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేకపోతోంది. ఇందుకు సంబంధించి అతని కథనం ప్రకారం వివరాలివి. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం ఆర్.కొత్తూరులో తంగేటి ఏసు అనే వ్యక్తి భార్య, కుమార్తెతో నివాసం ఉంటు న్నాడు. ఈయన నివాసం ఉంటున్న ఆర్.కొత్తూరు పి.పొన్నవోలు గ్రామ సచివాలయ పరిధిలోకి వస్తుంది. మూడేళ్ల క్రితం పి.పొన్నవోలు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ ఏసు మరణించినట్టుగా సచివాలయ రికార్డుల్లో పొరపాటున నమోదు చేశారు. అయితే ఈ విషయం తెలియని అతడు రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డుతో పాటు తమ కుటుంబ సభ్యుల వివరాలను తీసుకుని సచివాలయానికి వెళ్లడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సచివాలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రికార్డుల్లో మరణించినట్లుగా పొందుపరచడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. కనీసం డెత్ రికార్డులోని తన పేరును తొలగించి, బతికి ఉన్నట్టుగా చూపాలని వేడుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని అతడు వాపోయాడు. చేసేది లేక తన సమస్యను పరిష్కరించాలని సోమవారం అనకాపల్లిలోని కలెక్టరేట్‌లో అర్జీని సమర్పించాడు.

సర్కారు బడిలో చేరిన విద్యార్థులకు ఘన స్వాగతం

కొత్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు విద్యా సంస్థల నుంచి అనకాపల్లి మండలం మామిడిపాలెం హైస్కూలులో చేరిన 47 మంది విద్యార్థులకు గులాబీ పువ్వులతో ఉపాధ్యాయులు సోమవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో 160 మంది విద్యార్థులు చేరారన్నారు. వీరిలో 47 మంది వివిధ ప్రైవేటు విద్యాసంస్థలను విడిచిపెట్టి తమ పాఠశాలలో చేరడం ఆనందంగా ఉన్నట్టు చెప్పారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా జడ్పీ హైస్కూలులో విద్యాబోధన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వేదాలను భావితరాలకు అందించాలి'

సబ్బవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వేదమే సనాతన భారతీయ ధర్మానికి జీవన నాదమని గొల్లలపాలెం సప్తరుషి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మాధవ శర్మ అన్నారు. సోమవారం ట్రస్టు భవన్‌లో జరిగిన వేద దివస్ కార్యక్రమంలో మాట్లాడారు. వేదాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వేద విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని వినతి

కొత్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ఆరంభమైనా జిల్లాలో అనేక సమస్యలు విద్యార్థులకు విద్యనందకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ అడ్మిషన్లు జరుగుతున్నా ఇప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం కాలేదన్నారు. తక్షణమే ఈ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. అలాగే, మరిన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా కమిటీ సభ్యులు యు.జానకిరామ్, బి.కుమార్, యు.వాసు, బి.గణేష్, ఎం.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

అనకాపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్ స్టాప్ సెంటర్ ఎస్ఐ పి.రాములమ్మ అన్నారు. ఇక్కడి డాక్టర్ హిమశేఖర్ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. యువత దురలవాట్లకు లోనై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేష్, అధ్యాపకులు జగన్, గోపీకృష్ణ, తేజశ్విని, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

'భగవద్గీత మానవాళికి దిక్సూచి'

కొత్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణం వేల్పులవీధి కాశీ విశ్వేశ్వర ఆలయంలో భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జై గీతా భగవద్గీత సంస్థ కన్వీనర్ కడిమిశెట్టి శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి, నిర్వహణ కమిటీ కన్వీనర్ వెంకట కూర్మనాథం మాట్లాడుతూ బాల్యం నుంచి భగవద్గీతపై అవగాహన కల్పించాలన్నారు. ఆధ్యాత్మిక గ్రంథంగానే కాకుండా నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలతో నిండి ఉన్న భగవద్గీతపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ప్రతినిధులు పీవీ చిన్నయ్య, ఎన్‌వీ రమ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా రచయితలు జీఎల్ఎన్ శాస్త్రి, కె.సుబ్బారావు, పావని వ్యవహరించారు.

వైసీపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం రేపు

సబ్బవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమా వేశం బుధవారం ఇరువాడ జీఎస్ కన్వెన్షన్‌లో జరగ నుందని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలి పారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానున్న ఈ సమా వేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంట్ ఇన్‌చార్జి ధర్మశ్రీ హాజరు కానున్నారన్నారు. నియోజకవర్గంలోని వైసీపీ శ్రేణులంతా హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో నాయకులు కర్రి బాబు, పాలిశెట్టి సురేశ్ రాజ్, మోపాడ అప్పారావు, వడ్డాది అప్పలరాజు,పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల విజేతలకు సత్కారం

అనకాపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గవరపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం సత్కరించారు. ఆలయానికి వచ్చిన విజేతలైన కోన శ్రీనివాసరావు, యల్లపు కల్యాణ్, కాండ్రేగుల శ్యామ్, కొయిలాడ అర్చన, కనకమహాలక్ష్మి, కోట్ని మౌనిక, సూర్యకళ, గణేశ్‌లకు ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, మురళీ, గండేపల్లి మురళీ జ్ఞాపికలు అందజేశారు.

నిర్ణీత గడువులో అర్జీల పరిష్కారం

▸▸ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ సిన్హా ఆదేశం


కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో సత్యనారాయణరావు అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకున్న అర్జీలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని అర్జీల సంబంధించి కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చునని చెప్పారు. పీజీఆర్ఎస్ ముగిసే సరికి 313 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్ : పోలీస్ శాఖకు అందే అర్జీల పరిష్కారంలో అల సత్వం వహించొద్దని ఎస్పీ తుహిన్‌సిన్హా స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. అర్జీదారుల నుంచి ఎస్పీ తుహిన్‌సిన్హా నేరుగా వినతులు స్వీకరించారు. స్వయంగా వారి గోడును ఆలకించి సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ , నిర్ణీత గడువులో అర్జీలను పరిష్కరించాలన్నారు. కాగా, పీజీఆర్ఎస్‌కు 25 అర్జీలు అందగా, వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి అంశాలపై వినతులు ఎక్కువగా ఉన్నాయని పోలీస్ కార్యాలయ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదిలోనే అందరికీ సుపరిపాలన

▸▸ ప్రజలకు వివరించండి ▸▸ టీడీపీ శ్రేణుల శిక్షణలో పీలా గోవింద



సుపరిపాలనలో తొలి అడుగు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీలా, బత్తుల తదితరులు

అనకాపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజలందరికీ సుపరిపాలన అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో సోమవారం సాయంత్రం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంపై నియోజకవర్గ టీడీపీ శ్రేణులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ గత ఐదేళ్లు సాగించిన తుగ్లక్ పాలన వల్లే రాష్ట్రం అప్పులపాలయ్యిందని ఆరోపించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌లు పార్టీ బలోపేతానికి, ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు పోస్టర్‌ను అంతా ఆవిష్కరించారు. డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, ఏఎంసీ చైర్మన్ పచ్చికూర రాము, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్, టీడీపీ సీనియర్ నేతలు మాదంశెట్టి నీలబాబు, కర్రి బాబీ, కాయల మురళీ, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'లా విద్యార్థినిపై అత్యాచారం దారుణం'


కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో లా కళాశాల విద్యార్థినిపై సామూహికంగా అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు నిరసన తెలిపారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిళ్లా హరశ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోర్టు ఎదుట సోమవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఆడ పిల్లలపై దారుణాలకు పాల్పడుతున్న వారిని ప్రభుత్వం వదిలి పెట్టకూడదన్నారు. చట్టపరంగా శిక్షలు కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, కార్యదర్శి బంధం వెంకటరమణ, లైబ్రరీ సెక్రటరీ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ నిర్వాసితుల ఆందోళన

అనకాపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- అచ్యుతాపురం రహదారి విస్తరణలో నిర్వాసితులుగా మారిన వారికి టీడీఆర్ బాండ్లు కాకుండా నగదు రూపంలో పరిహారం చెల్లించాలని నిర్వాసితుల సంఘం ప్రతినిధులు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు, దుకాణాలు, భూములకు ఒకేసారి నష్టపరిహారం చెల్లించాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పించి నష్టపరిహారం ఇవ్వాలని, ఉపాధి కోల్పోతున్న చిరు వ్యాపారులకు పరిహారం ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు. సంఘ ప్రతినిధులు ఆర్.రాము, కె. రామసదాశివరావు, రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ, బుద్ద రంగారావు, శరగడం జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు పోలీస్ అధికారులకు సత్కారం



పదవీ విరమణ పొందిన అధికారు సత్కారంలో ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో వివిధ హోదాల్లో సేవలందించి సోమవారం పదవీ విరమణ పొందిన వారిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదన్నారు. పదవీ విరమణ సమయం వరకు ఈ శాఖలో పని చేయడం నిబద్ధతకు నిదర్శనంగా పేర్కొన్నారు. ఏఎస్పీలు అడ్మిన్, ఎన్.దేవప్రసాద్, ఏఎస్పీ క్రైమ్ ఎల్.మోహనరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆలయ భూముల కబ్జాపై ఆర్డీవోకు ఫిర్యాదు

కొత్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడలో ఉన్న కనకమహాలక్ష్మి దేవస్థానం, మరిడిమాంబ దేవాలయాలకు చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి నాగరాజు, సన్యాసినాయుడు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, సూరిబాబు తదితరులు ఆర్డీవో ఆయిషాకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ భూములపై పూర్తి విచారణ జరిపి దేవాలయాల భూమిని అప్పగించాలని కోరారు.

జాతీయ స్థాయి కరాటేకు ఏఎంఏఎల్ విద్యార్థులు


జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

కొత్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు సోమవారం తెలిపారు. జూలై ఒకటి నుంచి ఆరో తేదీ వరకు హైదరబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న ఈ పోటీల్లో కళాశాలలో ఇంటర్ చదువుతున్న లక్షిత్, ఎ.వరప్రసాద్ తలపడనున్నారన్నారు. క్రీడాకారులకు కళాశాల అధ్యక్షుడు శ్రీధరాల కృష్ణపేరరాజు, కరస్పాండెంట్ పి.వి.రామారావు, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్‌కుమార్, సూపరింటిండెంట్ పి.అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సబ్బవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అంతకాపల్లి సబ్ స్టేషన్‌లో అడిషినల్ బ్రేకర్ పనుల కారణంగా ఆ పరిధిలో గల గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, మొగలిపురం, బోదివలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపురఅగ్రహారం, టిక్కులిపాలెం, నాయనమ్మపా లెం, ఆరిపాక, గొట్టివాడ, పెదయాతపాలెం, బంగార మ్మపాలెం, అడ్డూరు, ఎల్లుప్పి, లగిశెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదన్నారు

ఆర్డీవో కార్యాలయం ఎదుట పాత్రికేయుల ధర్నా


ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న పాత్రికేయులు

అనకాపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మహాన్యూస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ సోమవారం ఇక్కడి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాత్రికేయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌బీఎల్ స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చింతల కిశోర్, జిల్లా కార్యదర్శి ఆళ్ల వెంకట అప్పారావు, ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మద్దాల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రమణాజీ, అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల భాస్కరరావు, భీమరశెట్టి గణేష్, చాగంటి సర్వారావు, భీమరశెట్టి నూకేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు పిళ్లా హర శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బంధం వెంకటరమణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మహిళలకు ప్రత్యేక గది ఏర్పాటుతో పాటు కోర్టు నూతన భవన నిర్మాణానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు.

అటవీ శాఖలో లక్ష్మణ్ సేవలు ఆదర్శనీయం

▸▸ పదవీ విరమణ సభలో ప్రశంసించిన వక్తలు


లక్ష్మణ్ దంపతులను సన్మానిస్తున్న అటవీ శాఖ ఉద్యోగులు

అనకాపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సోషల్ ఫారెస్ట్రీ అధికారి గంపా లక్ష్మణ్ సేవలు ఆదర్శనీయమని, వీటికి గుర్తింపుగా ప్రభుత్వం ఆయనకు వన శౌర్య పతకాన్ని అందించి సత్కరించిందని వక్తలు కొనియాడారు. సోమవారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో లక్ష్మణ్, ఆయన సతీమణి లక్ష్మి దంపతులను అటవీశాఖ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ లక్ష్మణ్ అటవీ శాఖలోని వివిధ జిల్లాల్లో అంకితభావంతో పనిచేసి 17 పర్యాయాలు ఉత్తమ అధికారి అవార్డులు అందుకున్నారని కొనియాడారు. ఉద్యోగులకు చేసిన సేవలతోనే గుర్తింపు వస్తుందన్నారు. ముఖ్య అతిథులుగా అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు (విజయనగరం), చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ షైదీన్ దివాన్, రీజనల్ మేనేజర్ ఏపీఎఫ్‌డీసీ జ్యోతి, అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, జిల్లా అటవీ శాఖ అధికారులు, అనకాపల్లి సోషల్ ఫారెస్ట్రీ ఎఫ్ఆర్‌వోలు బి.చంద్రశేఖర్, గౌరీశ్, జగదీశ్వరరావు, సుబ్బారావు, నూకరాజు, పైడిరాజు, రమణ తదితరులు హాజరయ్యారు.

నూకాంబిక ఆలయంలో వారాహిదేవి హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని నూకాంబిక ఆలయంలో సోమవారం వారాహిదేవి హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆషాఢ మాసం పంచమి తిథి సందర్భంగా తొలుత అర్చకులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకించి హోమాన్ని జరిపారు. ఆలయ సహాయ కమిషనర్ వెం పలి రాంబాబు, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులతో పాటు దూలం గోపి, మంగా ఈశ్వరరావు, మారిశెట్టి భాస్కరరావు దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

వైసీపీకి 83వ వార్డు నాయకురాలు లక్ష్మి రాజీనామా

అనకాపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్ 83వ వార్డుకు చెందిన వైసీపీ నాయకురాలు దొడ్డి లక్ష్మి ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేళ్లుగా పార్టీలో కొనసాగుతూ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేసినట్టు చెప్పారు. రెండు నెలల క్రితం పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా తనను అధిష్ఠానం నియమించిందన్నారు. కానీ సదరు లేఖ వచ్చిన కొన్ని గంటలకే కొందరు నాయకులు అందులో ఉన్న పేరు మార్చి వేరొక మహిళకు ఆ పదవి ఇచ్చారని ఆరోపించారు. ఈ అంశాన్ని పార్టీ నాయకులకు చెప్పినా పట్టించుకోక పోవడంతో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ఆమె ప్రకటించారు.



గ్రామ కమిటీలను ప్రకటిస్తున్న పార్టీ మండల పరిశీలకుడు వెంకటరమణ

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

టీడీపీ మండల పరిశీలకుడు గవిరెడ్డ వెంకటరమణ

గూడెంకొత్తవీధి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతమే లక్ష్యంగా గ్రామ కమిటీలు పనిచేయాలని పార్టీ మండల పరిశీలకుడు గవిరెడ్డి వెంకట రమణ సూచించారు. మండలంలోని 16 పంచాయతీల గ్రామ కమిటీల ఎన్నికలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో టీడీపీని బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, గ్రామ కమిటీలు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కలి మహేశ్, ఎంపీటీసీ సభ్యురాలు పసుపులేటి నాగమణి, సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి గంటా నళినికృష్ణ, పాండురాజు, మాజీ సర్పంచ్ పసుపులేటి రామకృష్ణ పాల్గొన్నారు.

తహశీల్దార్ నర్సమ్మ సేవలు ఆదర్శనీయం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



తహశీల్దార్ నర్సమ్మ దంపతులను సత్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తహశీల్దార్ ఆర్‌వీఎస్ఎల్. నర్సమ్మ సేవలు ఆదర్శనీయమని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో తహశీల్దార్ నర్సమ్మ సన్మాన సభను రెవెన్యూ శాఖ అధికారులు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలో ఎన్నో ఏళ్ల పాటు అంకితభావంతో విధులు నిర్వహించారని, ప్రజలతో మమేకమై రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. నర్సమ్మ పనితీరు ఎందరికో మార్గదర్శకమని కొనియాడారు. వృత్తినే దైవంగా భావించారని, గిరిజనులకు రెవెన్యూ శాఖ పరంగా ఎన్నో అత్యుత్తమైన సేవలు అందించారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవితం సుఖసంతోషాలతో సాగాలని జడ్పీ ఆమె కోరారు. అనంతరం తహశీల్దార్ నర్సమ్మ, వెంకటరమణ దంపతులకు జ్ఞాపికలు అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట, పెదబయలు తహశీల్దార్లు క్రిష్ణమూర్తి, రంగారావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యదరిర్శుల సంఘం ప్రతినిధులు

గూడెంకొత్తవీధి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శులు సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. సంఘం మండల కేంద్రంలో జరిగిన ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా వంతల పరుశురాముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.బాలకృష్ణ, కర్రి నాగ సత్యనారయాణ, కార్యదర్శిగా ఎం.జ్యోతిరాణి, సంయుక్త కార్యదర్శిగా కె.పూర్ణ చంద్రరావు, కోశాధికారి ఉప్పాడ అరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో పది మంది సభ్యులను ఎన్నుకున్నారు.

సొలబొంగులో నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ సెంటర్ ప్రారంభం



సొలబొంగులోని విద్యార్థులతో విద్యా వలంటీర్

అనంతగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ రైవాడ డ్యాం ఆనుకుని ఉన్న సొలబొంగు గ్రామంలో నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ సెంటర్ (పాఠశాల)ను సోమవారం నుంచి అధికారులు ప్రారంభించారు. సొలబొంగు గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు రైవాడ డ్యాంపై నాటుపడవలో ప్రయాణించి, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని తామరబ్బ ప్రాథమిక పాఠశాలలోని చదువుకునేవారు. అయితే దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలకు ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి, వీరభద్రపేట నుంచి సొలబొంగు గ్రామానికి జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.75 కోట్లతో రోడ్డు ప్రారంభించారు. అలాగే గ్రామానికి చెందిన గెమ్మెల రమణను విద్యా వలంటీర్‌గా నియమించారు. ఒకటి, రెండు తరగతులకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులకు సోమవారం తాత్కాలికంగా రేకుల షెడ్డులోని పాఠశాలను ఏర్పాటు చేసి విద్య బోధన చేస్తున్నారు. చదువు మానేసిన నలుగురు విద్యార్థులను గుర్తించి, వారిని జీనబాడు, పినకోట ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించారు.

సోదరికి అమూల్య అప్పగింత



అమూల్యను సోదరికి అప్పగిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్ లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న పాడేరుకు చెందిన గోడితల అమూల్య (20)ను ఆమె సోదరి కొండ స్వరూపకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. జూన్ 28న నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు రాత్రి సమయంలో గస్తీ తిరుగుతున్నప్పుడు అమూల్యను గుర్తించి నిరాశ్రయుల వసతి గృహానికి అప్పగించారన్నారు. పోలీస్ విచారణలో తాను ఒక అనాథ అని చెప్పిందని, కానీ ఇంటిలో చెప్పకుండా పారిపోయి వచ్చిందన్నారు. సోమవారం తన సోదరి కొండ స్వరూపను రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చి ఏయూటీడీ కేర్ టేకర్ నారాయణరావు సమక్షంలో క్షేమంగా అప్పగించినట్లు పేర్కొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం అందించండి

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సెక్షన్ అధికారి ఆదిత్య గోస్సైన్





హుకుంపేట: తడిగిరి సమావేశంలో మాట్లాడుతున్న ఆదిత్య గోస్సైన్... డుంబ్రిగుడ మండలం అంజోడలో పోషకాహార శిబిరాలను పరిశీలిస్తున్న ఆదిత్య గోస్సైన్

డుంబ్రిగుడ/హుకుంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సెక్షన్ అధికారి ఆదిత్య గోస్సైన్ స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం డుంబ్రిగుడ మండలంలోని అరమ పంచాయతీ పీవీటీజీ గ్రామం గొలంబా, హుకుంపేట మండలంలోని తడిగిరి పంచాయతీలో పర్యటించారు. గోల ంబాలో రూ.6 లక్షలతో నిర్మితమవుతున్న బహుళ ప్రయోజన భవనాన్ని పరిశీలించారు. పీవీటీజీ తెగల జీవన విధానం, రేషన్, ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులు ఉచిత బియ్యం తదితర అంశాలపై ఆరా తీశారు. 104 సేవలు, వైద్య శిబిరాల ఏర్పాటులో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా? లేదా? అని గిరిజనులకు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 104 సేవలుగాని, వైద్య శిబిరాలుగాని తమ గ్రామంలో ఏర్పాటు చేయలేదని గోలంబా గ్రామస్థులు తెలపగా, దీంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో రోడ్డు, తాగునీరు, వీధి దీపాలు, పీఎం జన్మన్ గృహాలు మంజూరు చేయాలని, బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ సేవలు కల్పించాలని గిరిజనులు విన్నవించారు. త్వరలోనే బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేస్తామని, గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు. అనంతరం అంజోడ గ్రామంలో ఏర్పాటు చేసిన పోషకాహార శిబిరాన్ని పరిశీలించారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోండి

హుకుంపేట మండలంలోని తడిగిరి పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సెక్షన్ అధికారి ఆదిత్య గోస్సైన్ మాట్లాడుతూ గిరిజనులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్, ఆయుష్మాన్ హెల్త్, రేషన్, కిషాన్, ఉపాధి పథకం జాబ్ కార్డులను అర్హులంతా పొందాలని తెలిపారు. గృహాలను సక్రమంగా నిర్మించుకోవాలని, వాటి బిల్లులను లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో జమచేస్తామని ఆయన చెప్పారు. అనంతరం గిరిజన సంప్రదాయాలతో గోస్సైన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ సమస్యలపై వినతులు అందించగా, వాటిపై ఆయన సానుకులంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు సహాయక అధికారి వెంకటేశ్వరరావు, పీఎంయూ అధికారి రాజేశ్, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ ముజీబ్, గిరిజన సంక్షమ శాఖ ఏఈ అభిషేక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరి, తడిగిరి సర్పంచ్ రంజిత్ కుమార్, గిరిజనులు పాల్గొన్నారు.

మారని అధికారుల తీరు

ప్రభుత్వ భవనాలకు తొలగని జగన్ చిత్రాలు

పట్టించుకోని కూటమి పాలకులు, నేతలు





చీడిపాలెం సచివాలయ భవనంపై మాజీ సీఎం జగన్ బొమ్మతో ఉన్న చిత్రాలు

కొయ్యూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయి ఏడాది దాటిపోయినా సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలపై ఇప్పటికీ గత ప్రభుత్వ ఆనవాళ్లే దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోని చీడిపాలెం పంచాయతీ కేంద్రంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాలపై ఇప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలతో కూడిన నవరత్నాల లోగోలు కనిపిస్తున్నాయి. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఈ విధంగా ఉంటే ఎవరూ పట్టించుకోరు. కానీ మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న సచివాలయాల్లోనే కనిపిస్తుండడంతో అధికారులు నిర్లక్ష్య వైఖరి తేటతెల్లం చేస్తున్నది. అయినప్పటికీ పలువురు కిమ్మనకుండా ఉండడం విశేషం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్‌గా రమణ



బాధ్యతలు స్వీకరించిన రమణ

చింతపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నివాసానుబంధ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఆర్ఐటీఐ) ప్రిన్సిపాల్‌గా ఎ.రమణ బాధ్యతలు స్వీకరించారు. ఆర్ఐటీఐలో ఏడాది పాటు ప్రిన్సిపాల్ పోస్టు ఖాళీగా వున్నది. దీంతో నర్సీపట్నం ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసచారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజా బదిలీల్లో అయన శ్రీకాకుళం బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ఆర్ఐటీఐలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమణకు ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. విధుల్లో చేసిన నూతన ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సమీపంలోనున్న ఐటీఐ వద్దకు వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన చేసుకోవాలన్నారు. జూలై 17 పరిశీలనకు ఆఖరుతేదీయని, చింతపల్లి ఐటీఐలో ప్రవేశాలకు జూలై 21న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

గ్రామ కమిటీలు క్షేత్ర స్థాయిలో బలంగా పనిచేయాలి

▸▸ టీడీపీ మండల పరిశీలకుడు దాసుబాబు



గ్రామ కమిటీ సభ్యులతో పార్టీ పరిశీలకుడు దాసుబాబు, టీడీపీ నాయకులు

చింతపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందించేందుకు గ్రామ కమిటీలు క్షేత్ర స్థాయిలో బలంగా పనిచేయాలని టీడీపీ మండల పరిశీలకుడు దాసుబాబు అన్నారు. మండలంలోని చింతపల్లి, గొందిపాకలు, కొమ్మంగి, చౌడుపల్లి, చౌడుపల్లి పంచాయతీల గ్రామ కమిటీల ఎన్నికలను సోమవారం నిర్వహించారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన కమిటీలతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. శివారు గిరిజన గ్రామాలకు రహదారులు, తాగు నీటి పథకాలు నిర్మించడం జరుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆనందరావు, బోనంగి చిన్నిపడాల్, కేశ్వరరావు, పాంగి రాము, మహేంద్ర, లక్ష్మణరావు, గాంధి పడాల్ పాల్గొన్నారు.

గెస్టు లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కర్రి సుధ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో మ్యాథ్స్, జువాలజీ, ఎకనామిక్స్, కంప్యూటర్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. వీటి భర్తీకి ఎంఎ, ఎమ్మెస్సీ చేసిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఎన్ఈటీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హతలుతో కూడిన బయోడేటాను ఈ నెల 2వ తేదీ లోగా కళాశాలలో స్వయంగా అందించాలని ప్రిన్సిపాల్ కోరారు.

9న దేశవ్యాప్త సమ్మె

రాంబిల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): లేబరు కోడ్లకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఇక్కడ సమ్మెకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా లేబర్‌కోడ్సను తీసుకువచ్చి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, మురా, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ సేవలు అభినందనీయం



పీడీ చంద్రశేఖర దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గూడెంకొత్తవీధి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు మద్దెల చంద్రశేఖర వరప్రసాద్ సేవలు అభినందనీయమని జర్రెల గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సింహాచలం అన్నారు. సోమవారం పదవీ విరమణ పొందిన స్థానిక పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర వరప్రసాద్, రాణి దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో పిఈటీగా, పీడీగా చంద్రశేఖర వరప్రసాద్ అత్యుత్తమ సేవలందించారన్నారు. ఆయన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించారన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు బి. కృష్ణారావు, గసాడి పద్మనాభం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి బురదమయం

జి.మాడుగుల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మాణంలోనున్న జాతీయ రహదారి వర్షానికి బురదమయమైపోయింది. దీంతో ఈ మార్గంపై ప్రయాణిస్తున్న వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జి.మాడుగుల-పాడేరు రహదారి బురదమయమైపోయింది. నాలుగు చక్రల వాహన దారుల ప్రయాణానికి ఇబ్బంది లేకపోయినప్పటికీ, ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురువుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణ అధికారులు రాకపోకలకు అంతరాయం కలగకుండగా వెట్ మిక్స్ వేయలేదు. దీంతో ప్రజలకు రవాణా కష్టాలు తప్పడంలేదు. జాతీయ రహదారుల అధికారులు రాకపోలకు అంతరాయం కలగకుండా నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బురదగా మారిన జి.మాడుగుల-పాడేరు రహదారి

ఉపాధ్యాయుడు అప్పారావుకు ఘనంగా సత్కారం



పెదబయలులో జీపీ.అప్పారావు, సత్యవతి దంపతులను సత్కరించిన కుటుంబీకులు

పెదబయలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేసి సోమవారం ఉద్యోగ విరమణ పొందిన గడ్డిపాంగి అప్పారావును ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా అప్పారావు వద్ద చదువుకొని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందిన పూర్వ విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు, బంధువులు ఆయన సేవలను కొనియాడారు. అలాగే వారంతా అప్పారావు, సత్యవతి దంపతులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాఫీ ఏడీ అప్పారావుకు ఘనంగా వీడ్కోలు



పాడేరులో రూడి అప్పారావు దంపతులను సత్కరిస్తున్న ఐటీడీఏ అధికారులు

పాడేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కాఫీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన రూడి అప్పారావుకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రూడి అప్పారావు, అప్పలమ్మ దంపతులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన సేవలను ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, ఏవో ఎం.హేమలత కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ హార్టికల్చర్ అధికారి రాజశేఖర్, ఐటీడీఏ అకౌంట్స్ అధికారి శ్రీనివాసకుమార్, ఐటీడీఏ మేనేజర్ పరంజ్యోతి, పద్మాపురంగార్డెన్ మేనేజర్ లకే బొంజుబాబు, విశ్రాంత కాఫీ ఏడీ అప్పలనాయుడు, ఐటీడీఏలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు పిచికారీ మందు

అనంతగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని రెండో విడత దోమల నివారణ మందు పిచికారీ ప్రారంభిస్తున్నామనిమలేరియా సబ్ యూనిట్ అధికారి బి.బాబురావు తెలిపారు. సోమవారం కాశీపట్నం సచివాలయం వద్ద నాలుగు పీహెచ్‌సీ ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేసిపలు సూచనలు చేశారు. దీనిపై గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు సమాచారం అందించాలని, గ్రామాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూడాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోనేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే ఇంటి లోపల, బయటా పిచికారీ చేయించుకునేలా గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలోని హెల్త్ సూపర్‌వైజర్లు రామకృష్ణ, దాలన్నదొర, రామచందర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యామ్నాయ పాఠశాలలు ఏర్పాటు చేయాలి

కొయ్యూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు లేని కొండలపై గల మారుమూల పీవీటీజీ గ్రామాలలో ప్రత్యామ్నాయ పాఠశాలలు ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ చూపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇరవాడ దేముడు దేముడు కోరారు. జిల్లా వ్యాప్తంగా కొండలపై గల పలు పీవీటీజీ గ్రామాలలో పాఠశాలలు లేక బడి ఈడు పిల్లలు చదువుకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాడేరు, రంపచోడవరం డివిజన్లలో కొండలపై గల పలు గ్రామాలలో ఈ దుస్థితి దాపురించిందని వాపోయారు. నిరక్షరాస్యత లేకుండా చేయాలంటే పాఠశాలలు లేని గ్రామాలు తక్షణం గుర్తించి, ఆయా గ్రామాలలో విద్యా వలంటీర్లు ద్వారా విద్యనందించే చర్యలు తీసుకోవాలని దేముడు కోరారు.

గంజాయి రవాణా కేసులో నిందితుడికి 12 ఏళ్ల జైలు

కొయ్యూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వ్యక్తికి 12 సంవత్సరాల జైలు శిక్ష వేస్తూ విశాఖపట్నం ఫస్టు క్లాస్ అడిషనల్ డిస్ట్రిక్టు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ మేరకు ప్రస్తుత సీఐ పీవీ.రమణ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. 2017 ఫిబ్రవరి 2 తేదీన గొలుగొండ మండలంలోని రావణాపల్లి గ్రామానికి చెందిన దేవర శివ 96 కిలోల గంజాయి రవాణా చేస్తూ వాహన తనిఖీలలో పట్టుపడ్డాడు. అప్పటి సీఐ ఆర్.మల్లికార్జునరావు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ఎన్ ప్రసాద్ కోర్టులో వాదించగా, శివకు 12 సంవత్సరాల జైలు శిక్ష వేస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువరించినట్టు సీఐ తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండాలి

అనకాపల్లి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్ స్టాప్ సెంటర్ ఎస్ఐ పి.రాములమ్మ అన్నారు. ఇక్కడి డాక్టర్ హిమశేఖర్ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. యువత దురలవాట్లకు లోనై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేష్, అధ్యాపకులు జగన్, గోపీకృష్ణ, తేజశ్విని, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

భూముల కబ్జాపై ఆర్డీవోకు ఫిర్యాదు

కొత్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడలో ఉన్న కనకమహాలక్ష్మి దేవస్థానం, మరిడిమాంబ దేవాలయాలకు చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి నాగరాజు, సన్యాసినాయుడు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, సూరిబాబు తదితరులు ఆర్డీవో ఆయిషాకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ భూములపై పూర్తి విచారణ జరిపి దేవాలయాల భూమిని అప్పగించాలని కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి : జడ్జి షియాజ్‌ఖాన్



పోలీసుల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జడ్జి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల ఐదో తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయంతం చేయాలని సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ అన్నారు. ఇక్కడి కోర్టు సముదాయంలో సోమవారం న్యాయవాదులు, పోలీసు అధికారులతో ప్రత్యేకంగా సమవేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గంలో పరిష్కారమయ్యే కేసులను లోక్ అదాలత్ పెట్టి పరిష్కరించాలని సూచించారు. దీని వలన కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందని వివరించారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

సమస్యలపై మునిసిపల్ కార్మికులు ర్యాలీ



కార్మికులతో మాట్లాడుతూ చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు పెంచాలని కోరుతూ మునిసిపల్ కార్మికులు ఇక్కడ బైక్ ర్యాలీ నిర్వహించారు. గత పది రోజులుగా మునిసిపాలిటీ నీటి సరఫరా, ఇంజనీరింగ్, వీధి దీపాల విభాగాలలో పని చేస్తున్న కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం బైక్ ర్యాలీ చేపట్టి మునిసిపల్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 26వ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి సదరు కార్మికులతో మాట్లాడారు. కార్మికులు వారి సమస్యలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతున్నామన్నారు. త్వరలోనే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని వివరించారు.

అటవీ సెక్షన్ అధికారి లక్ష్మణ్‌కు ఘనంగా వీడ్కోలు



లక్ష్మణ్‌కు జ్ఞాపిక అందిస్తున్న అటవీ అధికారులు

కృష్ణాదేవిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ అటవీ సెక్షన్ అధికారిగా పనిచేసిన ఆర్.లక్ష్మణ్ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగాఆయనకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఉత్తరాంధ్ర ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి డీఎఫ్‌వో సునీల్‌కుమార్, స్థానిక అటవీ రేంజ్ అధికారి కె.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై లక్ష్మణ్, అతని భార్య శుభలక్ష్మిలను సత్కరించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణాదేవిపేట, ఎలమంచిలి రేంజ్ అధికారులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి సత్యనారాయణ, అటవీ ఉద్యోగులు, గణపతి సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే అభివృద్ధిని చూపాం

▸▸ మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి వెల్లడి ▸▸ గత నాలుగేళ్లలో చేయలేకపోయారని ఎద్దేవా

▸▸ నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరైన వైసీపీ కౌన్సిలర్లు ▸▸ తొలుత ప్రగతిపై చర్చ జరిగాక నిరసన తెలుపుకోవాలన్న పద్మావతి



సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



నల్ల బ్యాడ్జీలు ధరించి వచ్చిన వైసీపీ కౌన్సిలర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో నాలుగేళ్లలో జరగని అభివృద్ధి ఏడాదిలోనే జరిగిందని టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి అధ్యక్షత నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఇక్కడ ఏర్పాటైంది. వైసీపీ కౌన్సిలర్లు నల్లబ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి వైసీపీ కౌన్సిలర్లను ఉద్దేశించి మాట్లాడుతూ నల్ల బ్యాడ్జీలు ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు. 15వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ గత నెలలో వైస్ చైర్మన్‌పై దాడి, బెదిరింపులకు నిరసనగా పెట్టుకున్నట్టు చెప్పారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ రూ.నాలుగు కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించాల్సి ఉందన్నారు. నిరసనలు చేయాలనుకుంటే అజెండా చదివిన తర్వాత చేసుకోవాలని సూచించారు. దీంతో సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి 18 అంశాలతో అజెండాను చదివి వినిపించారు. కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ నల్ల బ్యాడ్జీలు ఎందుకు పెట్టుకున్నారో స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు మాట్లాడుతూ ఎవరి సీట్లలో వారు కుర్చొని మాట్లాడితే ఏ సమస్య ఉండదని, సీటులోంచి లేచి మీదకు రావడం సరికాదని అన్నారు. పద్మావతిమాట్లాడుతూ 26వ వార్డులో జరిగిన డ్రైనేజీ అభివృద్ధి పనులపై ఎవరో వాట్సాప్‌లో పెడితే... ముప్పై ఏళ్లలో చేయలేని పని పద్మావతి చేశారని కోనేటి రామకృష్ణ మాట్లాడారన్నారు. తన వార్డులో ఏం చేశానో మీరు చెప్పనవరం లేదని, ప్రజలను అడిగితే వారు చెబుతారన్నారు. గత నాలుగేళ్లలో మీరు చేయలేని అభివృద్ధి ఒక్క ఏడాదిలో చేసి చూపించామని స్పష్టం చేశారు. కౌన్సిలర్ బుల్లిదొర మాట్లాడుతూ ఆస్తి హక్కు నిర్ణయించే అధికారం మునిసిపాలిటీకి ఉందా.. అని ప్రశ్నించారు. అజెండాలోని 14వ అంశంలో మాకిరెడ్డి విజయలక్ష్మి స్థల వివాదంపై న్యాయ సలహా తీసుకోవడం మంచిదన్నారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ చట్ట ప్రకారమే ముందుకు వెళుతున్నామని వివరించారు. మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ గతంలో చేసిన బిల్లులు త్వరగతిన మంజూరు చేయాలని కోరారు. నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ పని చేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను కౌన్సిల్ సమావేశంలో పెట్టి ప్రభుత్వానికి పంపాలన్నారు. దీనిపై కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ కార్మికుల సమస్యపై స్పీకర్ మాట్లాడారని తెలిపారు. తొమ్మిదో వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ వార్డులో విద్యుత్ స్తంభాలు వేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ డ్రైనేజీ పనుల్లో రూ.కోటి అవినీతి జరిగిందని పత్రికలలో చదివానని, దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఏఈ రవికుమార్ మాట్లాడుతూ రూ.8.3 కోట్ల అంచనాలతో రోడ్డు విస్తరణ పనుల మొదలు పెట్టారని, కాంట్రాక్టర్ రూ.1.19 కోట్లు పనిచేశారని తెలిపారు. విజిలెన్స్ అధికారుల విచారణలో కాలువ పనులలో లోపాలు చూపించి రూ.15లక్షలు ఫైన్ వేశారని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా పట్టణ సీఐ గోవింద రావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ

నర్సీపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఆర్డీవో వీవీ రమణ అందుబాటులో లేకపోవడంతో సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తహసీల్దార్ రామారావు ప్రజలు నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి 20 మంది వచ్చి వారి సమస్యలను విన్నవించారు. వీటిలో భూ సమస్యలపై అధికంగా అర్జీలు అందినట్టు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఆరిలోవ అటవీ ప్రాంతం మదుముల వద్ద రోడ్డు మరమ్మతులు

గొలుగొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతం మదుముల వద్ద రోడ్డు మరమ్మతులు చేపట్టారు. చీడిగుమ్మల-ఎర్రవరం నుంచి పప్పుశెట్టిపాలెం వరకూ గత ఏడాది ఆరిలోవ అటవీ ప్రాంతంలో తారు రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే నాలుగు మదుముల వద్ద నిర్మాణం పనులు చేపట్టలేదు. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ అధికారులు ఈ పనులు చేపట్టారు. ఇది చూసిన ఈ ప్రాంత వాహనదారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాచపల్లి రెవెన్యూ పరిధి భూమిలో సర్వేపై ఆందోళన

▸▸ ఎందుకు చేస్తున్నారో చెప్పాలంటూ తహసీల్దార్‌ను నిలదీసిన రైతులు



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సాగు రైతులు

మాకవరపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచపల్లి రెవెన్యూ 737 సర్వే నంబరులో తమ సాగులో ఉన్న భూమిని ఎందుకు సర్వే చేస్తున్నారో తెలపాలంటూ తహసీల్దార్ వెంకటరమణను పలువురు రైతులతో పాటు కాంగ్రెస్ నాయకుడు బొంతు రమణ, బీజేపీ నాయకుడు రాంబాబు ప్రశ్నించారు. సదరు భూమిని తహసీల్దార్ సోమవారం పరిశీలించారు. ఇది గుర్తించిన సాగు రైతులు ప్రశ్నించడంతో ఇది ప్రభుత్వ భూమి అని, ఎంత విస్తీర్ణంలో ఉందో తెలుసుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే జరుపుతున్నామని ఆయన వివరించారు. ఇదిలావుంటే, రాచపల్లి రెవెన్యూ ఎరకన్నపాలెం, వెంకయ్యపాలెం, రామన్నపాలెం, చినరాచపల్లి గ్రామాల్లో ఉన్న 737 సర్వే నంబరులో సుమారు 1400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమికి రెండు రోజుల కిందట సర్వే ప్రారంభించారు. ఈ భూములను గత 40 ఏళ్లుగా సన్న, చిన్నకారు రైతులతో పాటు బడా బాబులు సాగుచేస్తున్నారు. అయితే వీరి వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. కూటమి అధికారంలోకి రావడంతో ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పలు కంపెనీలు ఏర్పాటుకు ప్రయత్నాలు సాగిస్తున్నదని ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్డీవో, ఏపీఐఐసీ జోనల్ మనేజర్ ఈ భూమిని పలుమార్లు పరిశీలించారని సమాచారం. ఐదు రోజుల్లో ఈ భూమిని సర్వే చేయాలన్న జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సర్వే ప్రారంభించారని తెలిసింది. సర్వే ఎందుకు చేస్తున్నారో రైతులకు ఇంతవరకూ అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇక్కడ నాయకులు కూడా తలోమాట మాట్లాడుతుండడంతో రైతుల్లో అలజడి మొదలైంది. ఏదీ ఏమైనా భూ సర్వే ఎందుకు చేస్తున్నది రెవెన్యూ అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

స్పీకర్ అయ్యన్నను కలిసిన రేంజ్ ఆఫీసర్

▸▸ పెదబయలు నుంచి బదిలీపై వచ్చి బాధ్యతల స్వీకరణ



స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రేంజర్ వెంకట రాజేశ్వరరావు

నర్సీపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ నర్సీపట్నం రేంజ్ ఆఫీసర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన కర్రి వెంకట రాజేశ్వరరావు స్పీకర్ అయ్యన్నపాత్రుడ్ని తన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వంగా కలిశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో కొనసాగిన లక్ష్మీనర్సు పార్వతీపురం బదిలీ అయ్యారు. పాడేరు డివిజన్ పెదబయలు రేంజ్ అధికారిగా ఉన్న వెంకట రాజేశ్వరరావు ఇక్కడకు బదిలీపై విచ్చేశారు. ఇదిలావుంటే, గతంలో ఈయన కేడీపేట డీఆర్‌వో పని చేస్తూ పదోన్నతిపై పెదబయలు రేంజర్‌గా వెళ్లారు.

పాడి రైతులకు దాణా గిన్నెలు పంపిణీ

బుచ్చెయ్యపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాం పరిసర గ్రామాల్లో 300 మంది విశాఖ డెయిరీ పాడి రైతులకు దాణా గిన్నెలను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ రైతులకు ఎనలేని సేవలు అందిస్తుందన్నారు. అనంతరం శివరాంపురం పంచాయతీ అప్పంపాలెంలో రక్షిత నీటి పథకానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ నాగేశ్వరదేవి, గోకివాడ కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీను, గోలగాని రాజారావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రావికమతం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ కోరారు. సోమవారం తట్టబంద నుంచి జె.నాయుడు పాలెం వెళ్లే రోడ్డులో ఉపాధి హామీ పథకంలో మంజూరైన 250 మొక్కలను ఆయన గ్రామస్థులతో కలిసి నాటారు. గ్రామస్థులకు ఒక్కొక్కరితో రెండేసి మొక్కలు నాటించి, వాటిని పెంచే బాధ్యతను అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చెట్లను నరికేయడం వలన కాలుష్యం పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ వి.నూకరాజు, వార్డు సభ్యులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

దేవరాపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, సర్పంచ్ పెంటమ్మ సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వంజంగి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత బోరు సామగ్రి వేలం

మాడుగుల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాత బోరు సామగ్రిని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో ఆరుగురు పాటదారులు పాల్గొన్నారు. బోరు పైపులు, ఇత్తడి సామగ్రిని రావికమతం గ్రామానికి చెందిన బి. శ్రీను పాడుకున్నారు. అదేవిధంగా స్క్రాప్‌ను పీపీ అగ్రహారం గ్రామానికి చెందిన ఎం.వెంకటరమణ పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ నాగమల్లేశ్వరి, మండల పరిషత్ ఏవో గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోజంతా చిరుజల్లులు

మాడుగుల రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం కూడా తేలికపాటి చిరుజల్లులు కురిశాయి. ఆదివారం రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. సోమవారం కూడా చిరుజల్లులు రోజంతా పడుతూనే ఉన్నాయి. చిరుజల్లులతో రోడ్లు చిత్తడిగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. కూలీ పనులకు అవకాశం లేక కూలీలు ఇబ్బంది పడ్డారు. సరుగుడు, చెరకు కార్శి తోటలకు ఈ వర్షాలు అనుకూలంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.

హెచ్‌ఎం విష్ణు సేవలు అభినందనీయం

డీఈవో అప్పారావునాయుడు

బుచ్చెయ్యపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుడు గారపాటి విష్ణు సేవలు అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు అన్నారు. సోమవారం సీతయ్యపేట జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గారపాటి విష్ణు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీఈవో అప్పారావునాయుడు మాట్లాడుతూ విష్ణు మాస్టారు, ఉపాధ్యాయుల కృషితో హైస్కూల్ విద్యార్థులకు అత్యధిక మార్కులు వచ్చాయని, నలుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చాయని, అలాగే మూడు షైనీ అవార్డులు వచ్చాయన్నారు. హెచ్‌ఎం విష్ణు మాస్టారు సమకూర్చిన సొంత నిధుల నుంచి అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు రూ.ఐదు వేలు చొప్పున డీఈవో అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కాశీవిశ్వేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచ్ వజ్రపు ఇందిర, వజ్రపు బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీటీల సొమ్ముతో పరారైన మహిళ అరెస్టు

▸▸ పోలీస్ స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

కె.కోటపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):చీటీల పేరుతో మోసం చేసి కోట్లాది రూపాయలతో ఉడాయించిన మహిళను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు తమ సొమ్ము ఎలాగైనా ఇప్పించాలని పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. ఎక్కువగా డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు ప్రయత్నించగా అందరూ అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని చౌడువాడలో పెద్దిరెడ్ల పద్మజ రకరకాల చీటీలు నిర్వహించి పరారైంది. సుమారు 200 మంది బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించడంతో పద్మజను పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఆమెను అరెస్టు చేస్తే తనకు రావాల్సిన రూ.మూడు లక్షలు రాదన్న భయంతో ఇసరపు పైడ అప్పారావు అనే వ్యక్తి ఒంటి పై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పూనుకున్నాడు. ఎలాగైనా తమ సొమ్ము ఇప్పించాలని పలువురు కోరడంతో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు కొందరు పెద్దలు పద్మజతో మాట్లాడారు. తన వద్ద కేవలం కొద్ది మొత్తం మాత్రమే ఉందని, నాకు అనేక మంది నుంచి సొమ్ము రావాల్సి ఉందని చెప్పింది. అవి వసూలు చేసుకొని బాధితులు తీసుకోవాల్సిందిగా కోరింది. కనీసం కోటి యాభై లక్షల రూపాయలు అయినా చూడాలని పెద్దలు కోరినా తన వద్ద అంత సొమ్ము లేదని కరాఖండిగా చెప్పింది. ఈ లోగా పోలీసులు పద్మజ, ఆమె కుమారుడు, గ్రామంలో సన్నిహితంగా ఉన్న బాపనయ్య అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐ పైడపునాయుడు హుటాహుటిన వచ్చి బాధితులు ఎటువంటి ఆత్మహత్యలకు పూనుకున్న మరో కేసు నమోదు అవుతుందని హెచ్చరించారు. దోషులపై చర్యలు తీసుకోవడం జరిగిందని, ఆలస్యమైనా అందరికీ న్యాయం జరుగుతుందని వారు సర్దిచెప్పారు.

బీఎన్ రోడ్డుపై వినూత్న నిరసన



రోలుగుంటలో బీఎన్ రోడ్డుపై నిరసన తెలుపుతున్న దృశ్యం

రోలుగుంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):బీఎన్ రోడ్డుపై గుంతలు పూడ్చి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కోరుతూ సోమవారం రోలుగుంటలో సీపీఎం నేతలు చేపలు పడుతూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ చోడవరం నుంచి నర్సీపట్నం వరకు వెళ్లే ఈ రోడ్డులో గత ఐదేళ్లుగా మరమ్మతులు లేక పెద్ద పెద్ద గోతులు ఏర్పడి చెరువులను తలపిస్తున్నాయన్నారు. తరచూ ఈ రోడ్డులో వాహనాలు భారీ గోతుల్లో కూరుకుపోయి చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా 108 వాహనం కూడా ఇబ్బంది పడే పరిస్థితి నెలకొందన్నారు. అలాగే అనేక మంది ద్విచక్ర వాహనదారుల వాహనాలు మరమ్మతులకు గురై పాడైపోతున్నాయన్నారు. తక్షణమే ఈ గొయ్యిలను పూడ్చకపోతే అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

40 మందికి వైద్య పరీక్షలు

చీడికాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాల గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 40 మందికి పరీక్షలు చేసి, వైద్యులు మందులు పంపిణీ చేశారు. రోగులకు చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్, హెచ్‌సీ భవానీ, ఎంఎల్‌హెచ్‌సీ మొల్లి వరలక్ష్మి, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశవర్కర్ సేవలందించారు.

మేడివాడ, టి.అర్జాపురాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

రావికమతం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో మేడివాడ, టి.అర్జాపురం గ్రామాలలో లోఓల్టేజీ నివారణకు రెండు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరయ్యాయని ఏపీఈపీడీసీఎల్ మాడుగుల ఏడీఈ సురేష్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి 16 కేవీ సామర్థ్యం గల రెండు ట్రాన్స్‌ఫార్మర్లు వెంటనే ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. మేడివాడ, టి.అర్జాపురం గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యతో వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను ఈనెల 17వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఏడీ స్పందించారు. అదేరోజు ఆయా గ్రామాలను సందర్శించి, లోఓల్టేజీ నివారణకు అవసరమైన చర్యలను గుర్తించారు. ఈ మేరకు అవసరమైన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపారు. దీంతో ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేయడంతో ఆయా గ్రామాల్లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఏడీఈ సురేష్‌కుమార్ తెలిపారు.

వామ్మో..బీఎన్ రోడ్డా!

హడలిపోతున్న వాహనదారులు

మేడివాడ వద్ద కూరుపోయిన వ్యాన్

చెరువులను తలపిస్తున్న గోతులు



బీఎన్ రోడ్డు గొయ్యిలో కూరుకుపోయిన వ్యాన్

రావికమతం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డు పేరు వింటేనే వాహన చోదకులు హడలిపోతున్నారు. ఈ రహదారిలోని మేడివాడ దాటేలోగా ఏదో ఒక గొయ్యిలో వాహనాలు కూరుకుపోతుండడంతో భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు వాహనాలు గొయ్యిలో కూరుకుపోయాక ట్రాఫిక్‌కు అంతరాయంతో పాటు కూరుకుపోయిన వాహనాన్ని పైకి తీసేందుకు నరకం చూడాల్సి రావడంతో లబోదిబోమంటున్నారు. తాజాగా సోమవారం బీఎన్ రోడ్డులోని మేడివాడ వద్ద ఓ గొయ్యిలో లోడు వ్యాన్ కూరుకుపోయింది. దీన్ని పైకి లాగేందుకు డ్రైవర్లు, గ్రామస్థులు అష్టకష్టాలు పడ్డారు. నర్సీపట్నం-భీమునిపట్నం రోడ్డులోని మేడివాడ పాల కేంద్రం నుంచి వినాయక ఆలయం వరకు భారీగా గతుకులు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తు న్నాయి. దీంతో ఈ గోతుల లోతును గుర్తించలేని కారణంగా ప్రతి రోజూ ఏదో చోట ఒక్కటి, రెండు వాహనాలు కూరుకుపోతున్నాయి. ఫలితంగా గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో వాహన చోదకులకు, ప్రయాణికులకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులకు కనీసం చలనం లేకపోవడంపై వాహన చోదకులు స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకుల తీరుపై వారు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ రహదారిలో కనీసం గోతులనైనా పూడ్చాలని వారు వేడుకుంటున్నారు.

చిన్నప్పన్నపాలెం అమ్మవారి ఆలయంలో చోరీ

బుచ్చెయ్యపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నప్పన్నపాలెం అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. ఆలయంలో మెయిన్ గేట్ తాళాలు పగులగొట్టి విగ్రహంపై పది తులాల వెండి ఆభరణాలు, హుండీల్లోని రూ.30 వేలకు పైగా నగదు దోచుకున్నారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ తీసి వేశారు. ఆలయ కమిటీ సభ్యులు కోవెల రమేశ్, పి.రాము ఫిర్యాదు మేరకు బుచ్చెయ్యపేట పోలీసులు క్లూస్‌టీంతో వచ్చి ఆధారాలు సేకరించారు.

నీటి పథకాల పరిశుభ్రతపై అశ్రద్ధ తగదు : ఎంపీడీవో

చీడికాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రక్షిత నీటి పథకాల పరిశుభ్రతపై అశ్రద్ధ చేయవద్దని ఎంపీడీవో వి.హేమసుందరరావు పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు సూచించారు. మండలంలోని పెదగోగాడ, జి.కొత్తపల్లి పంచాయతీల్లో చెత్త సేకరణ, పారిశుధ్య పనులు, రక్షిత నీటి పథకాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను వాటర్ ట్యాంకు క్లోరినేషన్ ఏ విధంగా చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్.చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, ఎ.సన్యాసిరావు, సీహెచ్.స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో సచివాలయ సిబ్బంది పైరవీలు

... 5వ పేజీ తరువాయి

విధానంలో ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.

ముగిసిన బదిలీల ప్రక్రియ

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. జిల్లాలో మొత్తం 3,258 మంది గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు 170 మంది, పశు సంవర్ధక శాఖ సహాయకులు 187, ఏఎన్ఎంలు 442, ఇంజనీరింగ్ సహాయకులు 315, ఫిషరీస్ సహాయకులు 45, హార్టికల్చర్ సహాయకులు 89, మహిళా పోలీసులు 312, పంచాయతీ సెక్రటరీలు 155, డిజిటల్ సహాయకులు 384, సర్వే సహాయకులు 377, వీఆర్వోలు 75, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సహాయకులు 326, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు 46, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు 50, వార్డు ఎనర్జీ సెక్రటరీలు 3, వార్డు హెల్త్ సెక్రటరీలు 53, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు 38, వార్డు రెవెన్యూ సెక్రటరీలు 39, వార్డు శానిటేషన్ సెక్రటరీలు 52, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు 47, వార్డు ఉమెన్ వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీలు 44 మంది ఉన్నారు. వీరిలో ఐదు సంవత్సరాలు ఒకేచోట విధులు నిర్వహించిన వారు 2,820 మంది ఉన్నారు. వీరందరికీ బదిలీల్లో స్థానచలనం తప్పదని అంటున్నారు. అయితే కావాల్సిన చోట పోస్టింగుల కోసం సిఫారసులకే అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

హాస్టల్ నిర్వహణపై ఆగ్రహం

... 5వ పేజీ తరువాయి

నిలదీశారు. అనంతరం భోజనం రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారితో ఫోన్‌లో మంత్రి మాట్లాడి వసతి గృహంలో 44 మంది ఆడపిల్లలు ఉంటుండగా, ఇక్కడ వార్డెన్ లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తాను వసతి గృహానికి వచ్చి అర్ధగంట కావస్తున్నా వార్డెన్ రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సమగ్ర విచారణ జరిపి రెండ్రోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. మంత్రి వెంట వివిధ శాఖల అధికారులున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

అన్ని వ్యాపార సంస్థలను జీఎస్‌టీ పరిధిలోకి తేవాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని వ్యాపార సంస్థలను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జీఎస్‌టీ అధికారులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొన్ని వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను జీఎస్‌టీ చట్టం కింద నమోదు చేసుకోవాల్సి ఉన్నప్పటికీ, అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రాష్ట్ర జీఎస్‌టీ మరింత ప్రగతి సాధించే ఉద్దేశంతో జీఎస్‌టీ పరిధిలోకి వచ్చే సంస్థలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పాత బకాయిదారులను గుర్తించి, వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. జీఎస్‌టీ వసూళ్లు, అన్ని సంస్థలను పరిధిలోకి తెచ్చేందుకు అన్ని శాఖల ఉద్యోగులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ వై.కిరణ్‌కుమార్, ఉప కమిషనర్ అపర్ణ, జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి వి.సుధీర్, జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ అధికారి మన్మథరావు, జిల్లా భూగర్భ గనుల శాఖాధికారి శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక శాఖాధికారి మనోరమ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు విజయకృష్ణన్.. హాజరైన అధికారులు

చోరీ కేసుల్లో నలుగురి అరెస్టు

» 166.8 గ్రామాల బంగారు ఆభరణాలు స్వాధీనం

» నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు

మాకవరపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడేళ్లుగా జరిగిన పలు దొంగతనాల కేసుల్లో నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. మాకవరపాలెం పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఈ కేసుల వివరాలను ఆయన వెల్లడించారు. మాకవరపాలెంలోని ముత్యాల సత్యనారాయ ఇంట్లో బంగారం, వెండి, చంద్రయ్యపాలెం వద్ద నగదు, రాజుపేట ఒక ఇంట్లో బంగారం, అలాగే పింఛన్ల పంపిణీ సొమ్ము రూ.16 లక్షలు దొంగతనం చేశారన్నారు. ఈ చోరీలకు మాకవరపాలెం మండలంలోని గ్రామానికి చెందిన దల్లి కామిరెడ్డి, చినరాచపల్లి గ్రామానికి చెందిన కచ్చళ్ల రంజీవి, జంగాలపల్లి గ్రామానికి చెందిన సఖిలేటి సాయి, మాకవరపాలెం గ్రామానికి చెందిన దొండపాటి రవీంద్ర పాల్పడ్డారన్నారు. వీరి నుంచి 166.8 గ్రామాల బంగారం, 706 గ్రాముల వెండి, పింఛన్ సొమ్ము సంబంధించి రూ.9 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో రూ.3 లక్షలతో నిందితులు తామరం జగనన్న కాలనిలో ఇల్లు కట్టారని, దాంతో పాటు మిగిలిన నగదును రికవరీ చేస్తామని డీఎస్పీ తెలిపారు. ఇప్పటికే వీరిపై తూర్పుగోదావరి జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని చెప్పారు. మండలంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 112 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ చోరీ కేసుల ఛేదించడంలో కృషి చేసిన ఎస్ఐ మూర్తి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదరనాయుడు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

» ఐదు వాహనాలు స్వాధీనం: డీఎస్పీ మోహనరావు

అచ్యుతాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగను పట్టుకొని ఐదు వాహనాలు స్వాధీనం చేసుకున్నామని డీటీసీ డీఎస్పీ మోహనరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం సీఐ నమ్మి గణేశ్, ఎస్ఐ కె.సుధాకర్ ఆదివారం అచ్యుతాపురం జంక్షన్‌లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, పరవాడ వైపు నుంచి ఓ వ్యక్తి టీవీఎస్ మోపెడ్‌ను నడుపుకుంటూ వస్తూ పోలీసులను చూసి పరుగులు తీశాడని చెప్పారు. దీన్ని గమనించిన కానిస్టేబుళ్లు కె.గౌరినాయుడు, ఆర్.ప్రసాదరావు, హోమ్‌గార్డు ఎస్.రామకృష్ణ నిందితున్ని వెంటపడి పట్టుకున్నారన్నారు. నిందితుడు కశింకోట మండలం చరకం గ్రామానికి చెందిన రెడ్డి పైడం నాయుడుగా తెలిపారు. ఆయన బైక్‌ల దొంగతనాన్నే వృత్తిగా పెట్టుకున్నాడని డీఎస్పీ చెప్పారు.

పెద్దాస్పత్రికి సుస్తీ

... 5వ పేజీ తరువాయి

చాలా కీలకం. ఇందు కోసం టెంపరేచర్ కంట్రోల్ మెషీన్‌ను వినియోగిస్తుంటారు. ఈ మెషీన్ కూడా పని చేయడం లేదు. ఈ రెండు కీలక పరికరాలు పని చేయక పోవడంతో కార్డియాలజీ విభాగంలో శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. దీంతో పేద రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేజీహెచ్‌లో ఉచితంగా చేసే శస్త్ర చికిత్సలను, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి లక్షలాది రూపాయలు చేయించుకుంటున్నారు.

రెండున్నర కోట్లు కావాలి

ఈ శస్త్ర చికిత్సలు కేజీహెచ్‌లో నిర్వహించాలంటే హార్ట్ లంగ్ మెషీన్, టెంపరేచర్ కంట్రోల్ మెషీన్ అవసరముంది. ఒక్క హార్ట్ లంగ్ మెషీన్ సుమారు రూ.రెండు కోట్లు ఉంటుంది. అలాగే టెంపరేచర్ కంట్రోల్ మెషీన్‌కు మరో రూ.60 లక్షల వరకు ఖర్చవుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంత మొత్తం వెచ్చించడం ఆస్పత్రి అధికా రులకు సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ వాణి వెల్లడించారు. ఈ సమస్య నుంచి బయట పడే మార్గాల కోసం అన్వేషిస్తున్నట్టు చెప్పారు. ఒక ప్రైవేటు సంస్థ నుంచి అద్దెకు పరికరాన్ని తెచ్చే ఆలోచనలో ఉన్నామన్నారు. గతంలో అద్దెకు తెచ్చిన పరికరానికి నెలకు రూ.60 వేలు చెల్లించామని, ఇప్పుడు అద్దెకు తీసుకురావాలని భావిస్తున్న సంస్థ రూ.లక్షన్నర అడుగుతుండడంతో ఆలోచనలో పడ్డామని వెల్లడించారు.

బాలికల బడికి సొంత గూడు ఎన్నడో?

... 5వ పేజీ తరువాయి

విడుదల చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థలం అప్పగింత పూర్తికావడం, నిధులు కూడా మంజూరుకావడంతో ఇక భవనాల నిర్మాణం ప్రారంభమవుతుందని అందరూ భావించారు. అయితే ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఈ భవనాల నిర్మాణం ఆగిపోయింది. అప్పటి నుంచి ఈ స్కూల్ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఏడాదికి భవనానికి అద్దె రూపంలో సుమారుగా రూ.7 లక్షలు చెల్లిస్తున్నారు.

వివాదంలో పాఠశాల స్థలం

కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పాఠశాల భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టింది. అయితే పాఠశాలకు జన్నవరంలో కేటాయించిన స్థలంలో కాకుండా చోడవరంలోనే భవనాలు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే భావించారు. ఈ మేరకు స్థలాన్ని సమకూర్చాలని నిర్ణయించారు. ఈ విషయం తెలిసి జన్నవరం గ్రామస్థులు తమ గ్రామంలోనే భవనాలు నిర్మించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ప్రతివాదులుగా బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులను, ప్రభుత్వాన్ని చేర్చడంతో, ఈ హైస్కూల్‌ను ఎక్కడ నిర్మించాలనే నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై పడింది. కోర్టులో ఈ వివాదం తేలి, ప్రభుత్వం నిర్ణయం తీసుకుని నిధులు విడుదల చేస్తే తప్పా విద్యార్థినుల కష్టాలు తీరే దారి కనిపించడం లేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం

హైస్కూల్‌లో సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించాం. విద్యాపరంగా ఇబ్బంది లేదు. అద్దె భవనంలో వసతి పరంగా కొన్ని సమస్యలు ఉన్నాయి. అయినప్పటికీ సర్దుకుపోతున్నాం. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నాం.

-ఉష, ప్రిన్సిపాల్, జ్యోతిబాపూలే హైస్కూల్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మాడుగుల రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చికిత్స పొందతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని గరికబంద సమీపంలో బిల్లలపాలెం తాచేరు గెడ్డలో ఆదివారం ఐదుగురు స్నేహితులు ఈత సరదాగా కోసం నీటిలోకి దిగగా, వీరిలో ఖ్యాతితేజ మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆర్.ఎల్.కౌశల్ (33)ను మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చగా, ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్‌కి తరలించారు. పరిస్థితి విషమించడంతో కౌశ ల్‌ను విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం రాత్రి అక్కడ చికిత్స పొందుతూ కౌశల్ మృతి చెందాడు. కాగా, కౌశల్ విశాఖపట్నంలో సీలింగ్ వర్క్ చేస్తుంటాడు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామన్నారు. మిత్రులను కోల్పోవడంతో స్నేహితులు, మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

అనకాపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే పోలీసు విభాగంలో డిప్యూటేషన్‌పై హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కేవై.కామేశ్వరరావును ఎస్ఐగా చలామణి అవుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు ఇల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. 1991 బ్యాచ్‌కు చెందిన కేవై.కామేశ్వరవు జిల్లాలో కానిస్టేబుల్‌గా వేర్వేరు పోలీసు స్టేషన్లలో పనిచేశారు. మూడేళ్ల క్రితం రాజమండ్రి జీఆర్పీ హెచ్‌సీగా డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఈ క్రమంలో కామేశ్వరరావు అనేక పర్యాయాలు నక్కపల్లి టోల్ గేటు వద్ద తాను ఎస్ఐగా చెప్పుకొంటూ ఉచితంగా దాటేవారు. దీనిపై కొందరు జీఆర్పీ రాజమండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయానికి కానిస్టేబుల్ కామేశ్వరరావును సరెండర్ చేశారు. నాలుగు రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్న కామేశ్వరరావును అధికార దుర్వినియోగం అభియోగం రుజువు కావడంతో ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు.

జిల్లాలో ముసురు

అనకాపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముసురు వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 58.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మాడుగుల మండలంలో అత్యధికంగా 19.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, బుచ్చెయ్యపేట, రావికమతం, చోడవరం, పాయకరావుపేట మండలాల్లో సగటున 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనకాపల్లి, కశింకోట, మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, మాకవరపాలెం మండలాలతో పాటు పలు మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



లుంగీ కట్టు.. మాస్ లుక్!

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫీమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.